Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 191 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 7 - 3 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## నాడు ఆపరేషన్ సిందూర్‌లో వీరోచిత పోరు.. నేడు ఫైటర్ జెట్ ప్రమాదంలో మృతి



**న్యూఢిల్లీ :** అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్‌లో భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్ ఎస్‌యు–30 ఎంకెఐ ఫైటర్ జెట్ కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోగా.. వారిలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ ఆపరేషన్ సిం దూర్‌లో పాల్గొన్నట్లుగా సమాచారం. ఈ విషయాన్ని పూర్వేష్ తల్లిదండ్రులు మీడియాకు తెలిపారు. పూర్వేష్(28).. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లు అతని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముందుగా ఈ విషయం తమకు తెలియదని.. ఆపరేషన్ సిందూర్ ముగిసిన 15 రోజుల తరువాత తెలిసిందని పూర్వేష్ తండ్రి రవీంద్ర దురాగ్కర్ తెలిపారు. యుద్ధ సమయంలో పూర్వేష్ వద్ద ఫోన్ లేదని.. యుద్ధం ముగిసిన తరువాత పూర్వేష్ తమకు కాల్ చేసి విషయం చెప్పాడని రవీంద్ర తెలిపారు. అస్సాంలో ప్రమాదం జరగడానికి ఒక రోజు ముందు తన కొడుకుతో మాట్లాడినట్లు రవీంద్ర తెలిపారు. ఇంతలోనే ఇలా జరిగిందంటూ కన్నీరుమున్నీరయ్యారు. తన కొడుకు భారత వైమానిక దళంలో భాగమైనందుకు చాలా గర్వంగా ఉం దన్నారు. పూర్వేష్ ఎప్పుడు మాట్లాడినా యుద్ధ విమానాలను నడిపిన తన అనుభవాన్ని, ఐఏఎఫ్ జెట్‌ల వేగం గురించి ఎంతో ఆసక్తిగా చెబుతుండేవాడని.. తన సహోద్యోగులను ఎంతో గౌరవించేవాడని రవీంద్ర తెలిపారు. 'నా కొడుకు దేశ సేవలో తనను తాను త్యాగం చేసుకున్నాడు. పూర్వేష్ తన కలను నెరవేర్చుకున్నాడు. కానీ, తను కోరుకున్నం తగా దేశానికి సేవ చేయలేకపోయాడు. కేవలం 4 సంవత్సరాలు మాత్రమే పని చేశాడు. పది రోజుల క్రితం మా ఇంటికి వచ్చాడు. తిరిగి విధుల్లోకి చేరిన తరువాత ఇలా జరిగింది.' అంటూ రవీంద్ర విలపించారు.

**ప్రమాదం ఎలా జరిగింది..?**

ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్, స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ ఎస్‌యు–30 ఎంకెఐలో శిక్షణా మిషన్‌లో ఉన్నారు. జోర్హాట్ వైమానిక స్థావరం నుండి వీరి జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కనిపించకుండా పోయింది. సాయంత్రం 7:42 గంటలకు సుఖోయ్‌తో కమ్యూని కేషన్ కోల్పోయినట్లు తెలిపిన అధికారులు.. జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి 60 కిలోమీటర్ల దూరంలో కూలిపోయినట్లు గుర్తిం చారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయినట్లు అధికా రులు వెల్లడించారు.

**ఆపరేషన్ సిందూర్..**

పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయి బాలో భాగమైన రెసిస్టెన్స్ ఫ్రంట్.. గతేడాది ఏప్రిల్ 22న పహల్గా మ్‌లో ఉగ్రదాడికి తెగపడిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతిస్పం దనగా భారతదేశం మే 7వ తేదీన ఆపరేషన్ సిందూర్‌ను ప్రారం భించింది. భారత భద్రతా దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లో ఉగ్రవాద శిబిరాలపై దాడి చేశాయి. ఈ దాడుల్లో 100మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ తరువాత పాకిస్థాన్.. భారత్‌పై క్షిపణులు, డ్రోన్‌లతో దాడులకు తెగబడగా.. భారత రక్షణ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయి. ప్రతిదాడులతో పాక్‌ను షేక్ చేశాయి. మే 10వ తేదీన ఇరు దేశాలూ కాల్పుల విరమణ ప్రకటించాయి. దాంతో ఆపరేషన్ సిందూర్ నిలిచి పోయింది.

## తిరువూరులో హైటెన్షన్..144 సెక్షన్ విధింపు!

**తిరువూరు, (రాజధాని వార్తలు):** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియో జకవర్గంలో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న రాజకీయ ఉత్కంఠ పరాకాష్టకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరువూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై టీడీపీ, విపక్ష వైసీపీ నేతలు బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలోనే ఇరువర్గాల కీలక నేతలు 'బోసు బొమ్మ' సెం టర్‌లో చర్చకు వెళ్తున్న విషయం తెలుసుకొని పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అనంతరం ఇరు వర్గాలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బోస్ బొమ్మ సెంటర్ వద్ద పోలీసులు భారీగా మోహ రించారు. గత రెండు రోజులుగా తిరువూరు పట్టణంలో టీడీపీ–వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తుంది. నేతలు సవా ళ్లు, ప్రతి సవాళ్లు విసురుకుంటున్నారు. ఇరు వర్గాల నేతలకు స్థానిక తహశీల్దార్ సర్ది చెప్పాలని చూసినా వినకపోవడంతో తిరువూరు మండల వ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. ప్రజలు




గుంపులుగా ఉన్నా, ఉద్రిక్తతలకు కారణమయ్యే ర్యాలీలు, సభలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## వైసీపీ ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ 30 ఏళ్లు వెనక్కు.. పవన్ కళ్యాణ్ ధ్వజం




**అమరావతి, (రాజధాని వార్తలు):** జగన్ హయాంలో ఆర్థిక విధ్వసం చేసి, ఏపీని గందరగోళంలోకి నెట్టివేశారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ 30ఏళ్లు వెనక్కు వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కళ్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. మంత్రి పయ్యావుల కేశవ్ అసెబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 3.32లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సామాజిక భద్రత పెన్షన్ల కోసమే రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఇలాంటి పరిస్థితిని తట్టుకోవటం, పథకాలు ఇవ్వటానికి సీఎం చంద్రబాబుకు ఎంతో ధైర్యం ఉండాలని ప్రశంసించారు.

**విద్యుత్ సంస్థలకు నష్టం..**

ఈ సందర్భంగా 'నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదని... భావితరాల కోసం' అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తులను పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు. బడ్జెట్‌లో చంద్రబాబు దూరదృష్టి, దక్షత, దార్శనికత అడుగడుగునా ఉందని కొనియాడారు. వైసీపీ హయాంలో చేపట్టిన విద్యుత్ కొనుగోళ్ల కారణంగా డిస్కంలకు రూ.12,250కోట్ల నష్టం వచ్చిందని చెప్పుకొచ్చారు. కరెంట్ సరఫరాలో కూడా ఇబ్బందులు వచ్చాయని వివరించారు. రూ. 1.29 లక్షల కోట్లు విద్యుత్ సంస్థలు నష్టపోయాయని.. ఆ భారాన్ని ప్రజలపై మోపారని ఆగ్రహిం చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రూఅప్ చార్జీలు రద్దు చేసి ట్రూడౌన్ పేరిట ఛార్జీలు తగ్గించామని ప్రస్తావించారు.

**రూ.9లక్షల కోట్ల మేర అప్పులు..**

వైసీపీ ప్రభుత్వం రూ.9లక్షల కోట్ల మేర అప్పులు తమపై ఉంచి వెళ్లిందని పవన్ కళ్యాణ్ ధ్వజమెత్తారు. రూ.35 వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని.. అందులో రూ.25 వేల కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా రూ.7వేల కోట్లకు పైగా జత చేశామని వెల్లడించారు. గతంలో వైసీపీ రాష్ట్ర వాటా ఇవ్వకపోవటం వల్ల రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగమయ్యాయని చెప్పు కొచ్చారు. వైసీపీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేసిన అనేక ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వంలో ప్రారంభించామని తెలిపారు. జలజీవన్ మిషన్‌కు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్‌పై సీఎం కీలక ప్రకటన



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో 13 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలను బ్యాన్ చేసే అంశంపై చర్చిస్తున్నామని ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవడానికి వీల్లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనంపై ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఓ సిఫార్సు కూడా చేశారని సీఎం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం ప్రసంగించారు. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకు రావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబ డులు సాధించామని తెలిపారు. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు.

**పల్లెల్లో కొత్త వెలుగులు...**

రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి అవినీతిని కట్టడి చేశామని సీఎం చెప్పారు. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను మారుస్తున్నామని.. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలో మీటర్ల బీటీ రోడ్లు వేశారని ముఖ్యమంత్రి వివరించారు. 4,998 కిలో మీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకున్నారన్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలల నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. 9 కోట్ల పని దినాలు కల్పించేలా కూడా ఉప ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని సీఎం తెలిపారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగిందన్నారు. బడ్జెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుందామన్నారు సీఎం. పల్లెల్లో కొత్త వెలుగులు చూసేందుకు ఉప ముఖ్యమంత్రి తీసుకుంటున్న కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యారంగంలోనూ వివిధ సంస్కర ణల్ని అమలు చేసి నైపుణ్యం పెంచేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**హెల్తీ, వెల్దీ, హ్యాపీ సొసైటీగా ఏపీ..**

స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసుకున్నామని సీఎం తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నామని.. మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు అనుమతితో కర్నూలుకు హైకోర్టు బెంచ్ సాధించుకునేలా చర్యలు తీసుకుంటా మని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై సంకల్పం చేస్తామన్నారు. ఉగాదికి 3 లక్షల గృహ ప్రవేశాలు చేయించేలా చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. హెల్తీ, వెల్దీ, హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడు తున్నామన్నారు ముఖ్యమంత్రి.

**వారికి అదే చివరి రోజు...**

సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గిన్నీస్ రికార్డు సాధించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డేను నిర్వహించామ న్నారు. యోగా, నేచురోపతిలాంటి అంశాలను మేళవించి ప్రజారో గ్యాన్ని కాపాడతామని తెలిపారు. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజా రోగ్యాన్ని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నా మని చెప్పారు. వైట్ కాలర్ క్రైమ్స్, డిజిటల్ క్రైమ్స్, సైకోలు సోషల్ మీడియాలో అరాచకం చేస్తున్నారని.. మహిళలపై నేరా లకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని ముఖ్య మంత్రి చంద్రబాబు హెచ్చరించారు.

**ఇలాంటి నాయకుడు ఎక్కడైనా ఉంటారా..**

మావోయిస్టులను కట్టడి చేశామని.. ఫ్యాక్షనిజాన్ని రూపుమాపా మని తద్వారా ప్రగతి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చిందని.. 'పెళ్లికి వెళ్లే కూడా రప్పా రప్పా అంటూ దాడులు చేయాలా? భద్రతకు వెళ్లిన ఎస్ఐ గాయపడేలా పర్యటనలు ఉంటాయా? గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను పక్కన పెట్టుకునే నాయకుడు ఎక్కడైనా ఉంటారా? కటౌట్లకు పొట్టేళ్లతో రక్తాభిషేకం చేయటం ఏమిటి? ఇంత నేరుగా హింసను ప్రోత్సహిస్తారా?' అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వైసీపీ ఎమ్మెల్సీ బొత్సకు మరోసారి అస్వస్థత

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ శాసన మండలిలో వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. హైబీపీతో ఇబ్బంది పడుతున్న బొత్స.. మండలిలో మాట్లాడుతుండగా కింద పడబోయారు. దీంతో వెం టనే అసెంబ్లీ అధికార వర్గాలు అత్యవసరంగా వైద్యులను పిలి పించి, ఆయన ఛాంబర్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత.. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. బీపీలో హెచ్చుతగ్గులు, సరైన సమయానికి భోజనం చేయకపోవడం వంటి కారణాల వల్ల ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వైద్యులు వివరించారు. విశ్రాంతి తీసుకోవాలని, అవసరమైతే మరిన్ని వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. అలాగే, బొత్సతో హైదరాబాద్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బొత్స సత్యనారాయణ హైబీపీతో ఇబ్బంది పడుతున్నారని, బీపీ కంట్రో ల్‌లోకి రాకపోతే హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుందని వైద్యులు



సూచించారు. దీంతో బొత్సను సహచరులు ఆయన నివాసానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బొత్స సత్యనారాయణ ఆరోగ్యం నిలకడ గానే ఉందని సమాచారం.

## ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ రానున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికే షన్‌ను విడుదల చేసింది. పంజాబ్, హర్యానా హైకోర్టు నుంచి జస్టిస్ లీసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జస్టిస్ లీసా గిల్ ఏపీ హైకోర్టులో తొలుత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఏప్రిల్ నెలలో ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లీసా గిల్ ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు కేంద్ర న్యాయ




మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఏపీ హైకోర్టు చరిత్రలో తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ రికార్డు సృష్టించనున్నారు.

# నెల్లూరు ప్రియదర్శిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ, అన్నప్రసాద వితరణ






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని సంతపేట నాలుగు కాళ్ల మండపం, శ్వేత అవెన్యూ వద్ద శ్రీ రంగనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్స వాన్ని పురస్కరించుకుని, నెల్లూరు ప్రియదర్శిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, వాటర్ మరియు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చుట్టుప్రక్కల మరియు దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఈ విధంగా సేవ చేయడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి సహకరించిన వందన కేటరింగ్ వినయ్‌కి, అలాగే వాటర్ మరియు మజ్జిగ ప్యాకెట్లు అందించిన రఫీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ దేసు శ్రీ కల్పన, సెక్రటరీ డా. ప్రతిభా భారతి, ట్రెజరర్ దర్శి శ్రీవాణి, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మాగం గౌతమ్, క్లబ్ జెడ్‌సి సాదు యశ్వంత్, ఫాస్ట్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి సుధారాణి, ఫస్ట్ జాయింట్ సెక్రటరీ గుండ్లపల్లి విశాలి, శ్రీ ముకుంద గీత భక్త మండలి వ్యవస్థాపకురాలు సొల్లేటి శారదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# కోవూరు పంచాయతీని మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేయండి

## - పడుగుపాడు, పోతిరెడ్డిపాలెం గ్రామాలను కోవూరు మున్సిపాలిటీలో విలీన ప్రతిపాదన : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కోవూరు నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేసిన విజ్ఞప్తులకు ప్రభుత్వం నుండి సానుకూల స్పందన లభించింది. రాష్ట్ర బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం మరియు తాగునీటి సరఫరా కోసం కూటమి ప్రభుత్వం 14 వేల 539 కోట్లు కేటాయించి పట్టణాభివృద్ధికి బాటలు వేసిందని ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు పురపాలక శాఖ మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్స్‌లో కూడా ఏపీ మున్సిపాలిటీలు ముందంజలో ఉన్నాయని ఆమె ఈ సందర్భంగా కొనియాడారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణాన్ని గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి బుచ్చిరెడ్డి పాళెం పురపాలక సంఘంలో నిధుల కొరతను సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రేడ్-2 స్థాయికి తగ్గట్టుగా సిబ్బంది నియామకం, డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించాలని ముఖ్యంగా గుడిపల్లి మరియు రేబాల కాలువల వద్ద సైడ్ రివిట్‌మెంట్‌తో పాటు ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై స్పందించిన పురపాలక శాఖ మంత్రి నారాయణ, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ అభివృద్ధికి తగిన నిధులు కేటాయిస్తామని సభలో హామీ ఇచ్చారు. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న కోవూరు గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదనను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. 40 వేల పైగా జనాభా ఉన్న కోవూరుతో పాటు, భౌగోళికంగా కలిసిపోయిన పడుగుపాడు మరియు పోతిరెడ్డిపాలెం పంచాయతీలను విలీనం చేస్తే దాదాపు 75 వేల జనాభా అవుతుందని తద్వారా ఆ ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. దీనిపై మంత్రి నారాయణ సానుకూలంగా స్పందిస్తూ స్థానిక ప్రజల ఆకాంక్షల మేరకు కోవూరు పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు.

# రామయ్య బడి (మున్సిపల్ స్కూల్) లో ఉపాధ్యాయుల వేధింపులు, అక్రమాలు

## - జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుకు తల్లిదండ్రుల ఫిర్యాదు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేటలో ఉన్న రామయ్య బడి (మున్సిపల్ స్కూల్)లో జరుగుతున్న అక్రమాలు, ఉపాధ్యాయుల వేధింపులపై 7వ తరగతి చదువుతున్న ఒక విద్యార్థి తల్లి జ్యోతి, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుకి ఫిర్యాదు చేశారు. పాఠశాలలో భవ్యా టీచర్ సాయంత్రం 5:30 నుండి 7:30 వరకు ప్రైవేట్ ట్యూషన్లు నిర్వహిస్తూ ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ట్యూషన్లు నడపడాన్ని ప్రశ్నించినందుకు తమ పిల్లవాడిని టార్గెట్ చేసి స్కూల్‌కు వెళ్లినా కూడా గైర్హాజరు (ఖఎంవత్) వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా, భవ్యా టీచర్ ప్రభుత్వ కంప్యూటర్, ప్రింటర్‌ను ఉపయోగించి విద్యార్థుల వద్ద ప్రింటౌట్‌కు 2 రూపాయలు వసూలు చేస్తూ జిరాక్స్ షాప్ నడుపుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఫిబ్రవరి 27న డీఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ, తరగతి గదిలో విద్యార్థిపై ఉపాధ్యాయుల వేధింపులు ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు టీచర్ సైతం విద్యార్థులను మారుపేర్లతో పిలుస్తూ, ఆరోగ్య సమస్యలపై గేలి చేస్తూ బాడీ షేమింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలను ప్రశ్నించడానికి వెళ్లిన తమపై మార్చి 4వ తేదీన మధు సార్ చేయి చేసుకోబోయారని, వెంటనే 112కు కాల్ చేసి పోలీసులను పిలిపించడంతో గొడవ సద్దుమణిగిందని ఆమె తెలిపారు. పాఠశాలలో ఉన్న ఇతర తీవ్రమైన సమస్యలను కూడా ఆమె జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు అనుభవం లేదని, ఇంగ్లీష్ మీడియం క్లాసులను తెలుగులో చెబుతూ గైడ్లు చూసి రాసుకోమంటున్నారని, ఆ గైడ్ల కోసం కూడా డబ్బులు వసూలు చేశారని తెలిపారు. స్కూల్ కాంపౌండ్‌లో సిగరెట్లు, గుట్కాల వినియోగం జరుగుతోందని ఆరోపించారు. మైనర్ బాలుడిని వాచ్‌మెన్‌గా డ్యూటీలో పెట్టారని పేర్కొన్నారు. పాఠశాలలో ఉన్న సి.సి. కెమెరాలు పనిచేయడం లేదని తెలిపారు.

పాఠశాలలోని మరుగుదొడ్లకు (టాయిలెట్లకు) కనీసం తలుపులు కూడా లేవని వాపోయారు. ఈ సమస్యలపై స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ బాబుకి విన్నవిస్తే, "మా స్కూల్ ఇంతే, నచ్చితే ఉండండి లేకపోతే టీసీ తీసుకొని వెళ్లిపోండి. ఎక్కువ మాట్లాడితే టీసీ కూడా ఇవ్వను" అని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమపై దాడికి యత్నించిన మధు , బెదిరిం పులకు పాల్పడుతున్న ప్రిన్సిపాల్ రమేష్ మరియు ఈ గొడవలకు కారణమైన భవ్యా టీచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జ్యోతి, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుని కోరారు.

# ప్రతి ఇంటికి జనసేన సిద్ధాంతం - ప్రతి కార్యకర్తకు అండగా జనసేన






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని స్థానిక మూడో డివిజన్ జనసేన పార్టీఇంచార్జ్ బత్తల శ్రీకాంత్ ప్రతి కార్యకర్త ఇంటికి వెళ్లి జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం విస్తృతంగా చేపడుతున్నారు. ఈ సందర్భంగా వారు నగరంలోని మైపాడు గేట్ ప్రాంతంలో జనసేన ఉద్యమి సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిత్తలూరు సుందర్ రామిరెడ్డి, జనసేన నాయకులునూనె మల్లికార్జున యాదవ్, జనసేన పార్టీ ఆఫీస్ ఇన్చార్జి జమీర్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి పేదల సంక్షేమమే ధ్యేయంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అహర్నిశలు శ్రమిస్తున్నారని జనసేన సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి కొత్త వారిని కూడా క్రియాశీలక సభ్యులుగా చేరుస్తున్నామని జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాలు ప్రతి పేదవాడికి అందేలా ప్రత్యేక కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మనోజ్, గుత్తి శ్రీకాంత్, వెంకటేష్, శ్రీను, లోకేష్, దుర్గ, అంకేం కిషోర్, సన్నీ, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో న్యాయం చేయాలని డిమాండ్



**విజయవాడ, (రాజధాని వార్తలు):** డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ 2022లో ఇచ్చిన "చలో గవర్నర్ బంగ్లా" పిలుపు సందర్భంగా అరెస్టైన నాయకులు అప్పటి నుండి ఇప్పటి వరకు కోర్టు చుట్టూ తిరుగుతున్న పరిస్థితి కొనసాగుతోంది. ఈ కేసు విచారణలో భాగంగా (6 మార్చి 2026) విజయవాడలోని ఫిఫ్త్ మెజిస్ట్రేట్ కోర్టుకు పలువురు నాయకులు హాజరయ్యారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి అతని మృతదేహాన్ని ఇంటి వద్దకు తీసుకెళ్లి డోర్ డెలివరీ చేసిన అనంతబాబు బయట స్వేచ్ఛగా తిరుగుతుండగా, బాధితుడికి న్యాయం చేయాలని పోరాటం చేసిన సామాజిక, రాజకీయ నాయకులు మాత్రం కేసుల్లో ఇరుక్కొని కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జరిగిన చలో గవర్నర్ బంగ్లా కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు. అప్పటి నుండి ప్రతి విచారణకు వారు విజయవాడ కోర్టుకు హాజరవుతూ న్యాయపోరాటం కొనసాగిస్తున్నారు.

**ఈరోజు కోర్టుకు హాజరైన నాయకులు: అక్కినేని వనజ** జె.వి.ప్రభాకర్, పిట్టా వరప్రసాద్, తాటిపాక మధు, దానం లాజర్ బాబు, కె.శైలజ, తునం వీరయ్య, తోకల ప్రసాద్, జి. లోవరత్నం. కారవది సుబ్బారావులు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిజమైన నిందితులకు కఠిన శిక్ష పడే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. న్యాయం కోసం పోరాడిన నాయకులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కూడా వారు డిమాండ్ చేశారు.

# టిడిపి అనుబంధ కమిటీలలో మహిళలు, యువతకు పెద్దపీట వేయాలి : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని అనుబంధ విభాగాల కమిటీల నియామకంపై కీలక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొని కమిటీల నియామక విధి విధానాలపై తమ అమూల్యమైన సూచనలు చేశారు. సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతంలో మహిళల పాత్ర అనిర్వచనీయమని పేర్కొన్నారు. అనుబంధ కమిటీలలో మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని అలాగే ఉత్సాహవంతులైన యువతకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రతిపాదించారు. ప్రతి నియోజకవర్గానికి సమాన ప్రాధాన్యతనిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీ వాణిని వినిపించేలా కమిటీల కూర్పు ఉండాలని ఆమె సూచించారు. పార్టీ అనుబంధ సంఘాలు సమన్వయంతో పనిచేసినప్పుడే పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామ నారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎమ్మెల్సీ రామ్ భూపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మరియు ఎమ్మెల్సీ బీద రవి చంద్రలతో పాటు జిల్లాలోని ఇతర ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు కమిటీల రూపకల్పనపై చర్చించి తమ సూచనలు సలహాలు అందజేశారు.

# అల్లా ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలి

## - జిల్లా అన్ని రంగాల్లో అభివృధి చెందాలి - ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి
## - మదీనా వాచ్ అధినేత ఇంతియాజ్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఎంపీ విపిఆర్






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అల్లా ఆశీస్సులతో నెల్లూరు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మదీనా వాచ్ అధినేత ఇంతియాజ్ గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇంతియాజ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతో షంగా ఉందన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ నెల శుభాకాం క్షలు తెలిపారు. రంజాన్ నెల అంటే ఖురాన్ అవతరించిన నెల అని, రోజంతా ఉపవాస దీక్షతో ఉండి, సాయంత్రం వేళ భక్తితో ప్రార్థనలు చేసి ఉ పవాసాన్ని విరమిస్తారన్నారు. ఇఫ్తార్ విందు అంటే కేవలం భోజనం మాత్రమే కాదు.. అల్లా ఆశీసులు అందు కునే అవకాశమని చెప్పారు. పేదలకు దాన ధర్మాలు, తోటివారికి భోజనం అందించడం రంజాన్‌లో పవిత్రమైన కార్యాలని, ఆపదలో ఆదుకున్నవారిని.. అల్లా చల్లగా చూస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.




# సభ్యత్వ నమోదులో కార్యకర్తలు మరింత భాగస్వాములు కావాలి : ఎంపి ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ, (రాజధాని వార్తలు):** జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత భాగస్వాములు అయ్యి కాకినాడ పార్లమెంటు నియోజకవర్గాన్ని మొదటి స్థానం నిలి పేందుకు కృషి చేయాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం కాకినాడ క్యాంపు కార్యాలయంలో జగ్గంపేట, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, సాధక్‌లతో సమావేశం నిర్వ హించి సభ్యత నమోదుపై సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ గ్రామస్థాయి నుండి బలోపేతం అవుతుందన్నారు. పార్టీ సిద్ధాంతాలు ఆశయాలకు ఆకర్షితులై అనేకమంది పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపు తున్నారని తెలిపారు. ఫిబ్రవరి 26 నుండి ప్రారంభమైన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంలా సాగు తుందన్నారు. ఆయా నియోజకవర్గాల్లో సాధక్‌లు అంకితభావంతో పనిచేసి ఇంటింటికి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను వివరించి సభ్యత్వ నమోదులో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఇప్పటికే సభ్యత్వ నమోదులో రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, ఇదే స్ఫూర్తితో కాకినాడ పార్ల మెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల పార్టీ నాయకులు, కార్య కర్తలు మరింత ఉత్సాహంగా పనిచేయాలని కోరారు. ఇతర పార్టీలకు భిన్నంగా పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు గౌరవం, గుర్తింపుతో పాటు భీమా రక్షణ ఇస్తున్న ఏకైక పార్టీ జనసేన పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో డిసిసిబి అధ్యక్షులు, జిల్లా జనసేన పార్టీ తుమ్మల బాబు, జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వ యకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ), పార్టీ నాయకులు నల్లం వాసు, బార్లపూడి క్రాంతి, చోడిశెట్టి గణేష్, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# నూకాలమ్మ ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం కంద్రకోట గ్రామ దేవత అయిన శ్రీ నూకాలమ్మ ఆలయంలో జరగనున్న ఉగాది జాతర ఉత్సవాలకు సభందించి పందిరి రాట ముహూర్త పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యని ర్వాహణాధికారి రాంబాబు రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 9.45 గంటలకు ఆలయంలో పందిరి రాట పూజలు చేపట్టి ఉత్సవాల ఏర్పాట్లను ప్రారభించారు.

కాగా అమ్మవారి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ అధికారి రాంబాబు రెడ్డి చెప్పారు. ఈ పూజల్లో ఆలయ సిబ్బంది, అర్చకులు, నాయకులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సమాజంలో లింగ నిర్ధారణ పరీ క్షలు నిర్వహించడం చట్టవిరుద్ధమని, అలా జరిగితే కఠిన చర్యలు తప్పవని సిడిపిఓ జి ఉష అన్నారు. మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సామర్లకోట మండలంలో అంత ర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సామర్లకోట గాంధీ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీవో ఉష పాల్గొని ప్రసంగించారు. గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణ చేయడం చట్ట విరుద్ధమని, ఇటువంటి చర్యలు సమాజంలో లింగ అసమానత లకు దారి తీస్తాయన్నారు. ఆడశిశువు రక్షణ, మహిళల గౌరవం కోసం ప్రభుత్వం పలు చట్టాలు అమలు చేస్తున్నదని వివరించారు. పీసీపీ ఎన్‌డీటీ చట్టం ద్వారా గర్భస్థ శిశు లింగ నిర్ధారణను పూర్తిగా నిషేధించారని, ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి కఠిన మైన శిక్షలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. సమాజంలో ఆడపిల్లల పట్ల గౌరవం పెంపొందించి, బాలికల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, స్థానిక కమ్యూనిటీ ప్రజలు పాల్గొనగా వారికి చట్టం యొక్క ముఖ్య అంశాలు, నిబంధనలు, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వై జర్లు ఉమాదేవి, సత్తార్ బీబి, వైద్యాధికారులు డా. ప్రభ, డా.రమశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# పారిశ్రామిక అభివృద్ధి వైపు దృష్టి సారించాలి

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** విద్యార్థి దశ నుండే పొదుపు పట్ల అవగాహన కల్పించుకుంటూ, పారిశ్రామిక అభివృద్ధి వైపు దృష్టి సారించాలని సామర్లకోట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిలేషన్ మేనేజర్ వినోద్ కుమార్ కోరారు. స్థానిక వై ఆర్ ఎల్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ప్రత్యేక అవగాహన శిబిరం నిర్వహిం చారు. బ్యాంకర్లు అందిస్తున్న విద్యా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అంకితభావం, క్రమశిక్షణ, మంచి ప్రవర్తన కూడా అలవర్చుకోవాలని వినోద్ కుమార్ వివరించారు. కళాశాల స్థాయి నుండి విద్యార్థులు భవిష్యత్తు పట్ల మక్కువ కలిగి ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వై లావణ్య మాట్లాడుతూ విద్యార్థులు స్కిల్ డెవలప్మెంట్ పెంపొందించుకోవాలని కోరారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ మణి ఈశ్వర్, బ్యాంకు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే పార్టీ కార్యాలయ పనులు పరిశీలన



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురంలో నూతనంగా నిర్మి స్తున్న తెలుగుదేశం పార్టీ కార్యాలయ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గురువారం పరిశీలించారు. పార్టీకి పూర్తిస్థాయిలో కార్యాలయాన్ని నిర్మించడం ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. కార్యాల యం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్కు పలు సలహాలు, సూచనలు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట సామర్లకోట పార్టీ పట్టణ అధ్య క్షులు బడుగు శ్రీకాంత్, గౌరవ అధ్యక్షులు అడబాల కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాక్‌లో జాయింట్ ఇన్స్పెక్షన్ తనిఖీలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట రాక్ సిరామిక్స్ పరి శ్రమలో పరిశ్రమల జాయింట్ ఇన్‌స్పెక్షన్ తనిఖీలు జరిగాయి. డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరిస్ నారాయణ, జిల్లా పరిశ్ర మల శాఖ జనరల్ మేనేజర్ గణపతి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ గౌతమ్ బృందం గురువారం సిరామిక్స్ పరిశ్రమను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పరిశ్రమ రికార్డులను డీసీఐ ఎఫ్‌తో కలిసి పరిశీలించారు. కాగా వాటిలో ఎలాంటి అభ్యంత రాలు లేనట్టు గుర్తించి సంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్లాంట్ హెడ్ శివాజీ గణేష్ చెప్పారు. కాగా పరిశ్రమ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యో గులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రమాధ రహిత పరిశ్రమగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా ప్రమాధాలపై డెమో ప్రదర్శన ద్వారా అవగాహనా చేపట్టారు. ఈ తనిఖీల్లో హెచ్ ఆర్ హెడ్ హరి కృష్ణమ రాజు, అకౌంట్స్ హెడ్ నటరాజ్, ఇహెచ్ ఎస్ మేనేజర్ బాలాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాణాసంచా ప్రమాదంలో మరో ఇద్దరు మృతి - 28కి చేరిన మృతుల సంఖ్య

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం వేట్లపాలెం బాణాసంచా తయారీకి అందరంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు కార్మికులు గురువారం మృతి చెందారు. వేట్లపాలెం గ్రామానికి చెందిన సప్ప సత్య వెంకట లక్ష్మి (34), పెద్దాపురం పట్టణం కొండయ్య పేటకు చెందిన మోర్త శ్రీను (30) లు మృతి చెందారు. వీరితో బాణాసంచా ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య 28కి చేరింది. అగ్ని ప్రమాద సంఘటనలో అధికారులు స్థానికులు అందించిన వివరాల ప్రకా రం 20 మంది అక్కడికక్కడే మృతి చెందగా 9 మంది తీవ్ర గాయాలతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేరారు. మరో కార్మికు రాలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నట్టు సమాచారం. అయితే సంఘటన జరిగిన అనంతరం గురువారం మధ్యాహ్నాం నాటికి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తొమ్మిది మంది కార్మికుల్లో ఎనిమిది మంది మృతి చెందారు. సామర్లకోటకు చెందిన మరొక కార్మికుడు మాత్రం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికురాలి యోగక్షేమాలు తెలియ రాలేదు.

# సంపాదకీయం

## వీడని వలసవాద మనో బంధాలు!

కేంద్ర ప్రభుత్వ కార్యకలాపాలలో పేర్ల మార్పు, విగ్రహ ప్రతిష్ఠాపన ప్రాధాన్యం పొందుతున్నాయి. ప్రతి నెలా కాకపోయినా మూడు నాలుగు నెలలకోసారి ఒక నగరం లేదా ఒక రోడ్డు పేరు మార్పును ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. హిందీ భాషలో ఉన్న పేరుతో ఒక కొత్త చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టడమో లేదా ఆమోదించడమో జరుగుతోంది. ఎక్కడో ఒకచోట ఒక కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేస్తోంది. వలస పాలన అవశేషాలను తొలగించడం లేదా మొగల్ చరిత్ర గుర్తులను తీసివేయడం పేరిట ఇవన్నీ జరుగుతున్నాయి. పది రోజుల క్రితం రాష్ట్రపతి భవన్ ఆవరణలో ఎడ్విన్ లూట్యెన్స్ విగ్రహం స్థానంలో సి.రాజగోపాలాచారి ప్రతిమ నేర్పాటు చేశారు. న్యూఢిల్లీ నగర నిర్మాణ శిల్పి లూట్యెన్స్. రాజాజీగా సుప్రసిద్ధుడైన చక్రవర్తుల రాజగోపాలాచారి భారతదేశ చిట్టచివరి గవర్నర్?జనరల్, ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి, ముఖ్యంగా మహాత్మాగాంధీ 'మనస్సాక్షి సంరక్షకుడు'గా సువిఖ్యాతుడు. 1954లో భారత ప్రభుత్వం ఆయనను భారతరత్న పురస్కారంతో గౌరవించింది. రాష్ట్రపతి భవన్ ఆవరణలో రాజాజీ విగ్రహ ప్రతిష్ఠాపన ఆయన సమున్నత చరిత్రను జాతి జ్ఞాపకం చేసుకుంటున్న తీరుకు ఒక ఉదాత్త తార్కాణం. ఈ సంస్మరణను, ఎలా భావిస్తున్నారు అనేదే సమస్య. జాతీయవాద సంబంధితమైనదని వివరిస్తున్నప్పటికీ వలసవాద పాలన దుష్ప్రభావాల నుంచి విముక్తి సాధనకు అదొక స్ఫూర్తిదాయక చిహ్నమని ఘంటాపథంగా చెప్పారు ప్రతిష్ఠాపకులు. రాష్ట్రపతి భవన్‌లో ఆ సౌధ వాస్తు శిల్పి లూట్యెన్స్ ప్రతిమను తొలగించడంపై సహజంగానే సణుగుడు విన్పించింది. కొంతమంది తీవ్ర విమర్శలూ చేశారు. అయితే ఆ విమర్శలు, ఆక్షేపణలు జాతి వ్యతిరేకమైనవని, వలసవాద బానిసత్వానికి గుర్తులని సామాజిక మాధ్యమాలలో పలువురు ధ్వజమెత్తారు. లూట్యెన్స్ న్యూఢిల్లీ నగర నిర్మాణశిల్పి కదా అని అన్నప్పుడు భారతీయుల గురించి ఆయన అభిప్రాయాలను ఏకరువు పెడుతూ న్యూఢిల్లీ వాస్తుశిల్పి ఒక జాత్యహంకారవాది అని వర్తమాన జాతీయవాద ధోరణులను సమర్థించేవారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లెక్కన, గతించిన కాలంలోని మన నాయకులు ఎంతమంది విశాల, మానవతా భావాల పరీక్షలో నెగ్గుతారు? అదలా ఉంచితే స్వాతంత్ర్యానంతర, ముఖ్యంగా మన వర్తమాన నాయకుల వలసవాద వ్యతిరేకతను నిశితంగా చూడవలసిన అవసరమున్నది. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వ చారిత్రక దృక్పథం, విధాన నిర్ణయాలు, సాంస్కృతిక ఆసక్తులు, ప్రతిపాదిత చట్టాలు, ఆర్థిక అజెండా... అన్నీ వలస పాలకుల విధానాలు, వ్యూహాలు, పద్ధతులకు అనుగుణంగా ఉన్నవే. వలసవాదం విషయంలో బయటి మనిషి వర్సెస్ లోపలి మనిషి అంటే విదేశీయులు వర్సెస్ దేశీయులు అన్న వాదన సహేతుకమైనది కాదు. ఎందుకంటే వలసవాదులు ఎవరు (దేశీయులా, విదేశీయులా) అన్న ప్రశ్న వలసవాదం నిజమైన స్వభావాన్ని అర్థం చేసుకునేందుకు తోడ్పడదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఆ ప్రశ్న వలసవాదం నిజస్వభావాన్ని కప్పిపుచ్చుతుంది. వలసవాదం ఒక సాంస్కృతిక?ఆర్థిక వ్యవస్థ. ప్రజలను సంపూర్ణంగా నియంత్రించే వ్యవస్థ. అవసరమైతే వారిని పూర్తిగా కకావికలు చేయగల శక్తిమంతమైన అధికార వ్యవస్థ. వలసవాదం ప్రజలకు ప్రాథమిక హక్కులను నిరాకరిస్తుంది. శిక్షా స్మృతి, నేర విచారణా స్మృతి మొదలైన వలస పాలకుల కాలం నాటి చట్టాల స్థానంలో 2023లో భారతీయ న్యాయసంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహితలను తీసుకువచ్చారు. అయితే ఆ చట్టాలలో మార్పులు సారహీనమైనవని న్యాయశాస్త్ర కోవిదులు కొట్టివేశారు. ఈ సంహితలలోని కొన్ని కొత్త నిబంధనలు వలస పాలనా కాలం నాటి చట్టాలలోని నిబంధనల కంటే కూడా ప్రగతి నిరోధకమైనవని వారు స్పష్టంగా ఎత్తి చూపారు. చట్టాల పేర్లు మార్చారు కానీ ఆ పేర్ల మార్పుతో పాటు రాజ్య వ్యవస్థలో, పౌరుల మధ్య సంబంధాలలో మార్పేమీ రాలేదు. ఇటీవల న్యూఢిల్లీలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026 వద్ద ప్రధానమంత్రికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అర్ధనగ్న నిరసన ప్రదర్శననే చూడండి. కాంగ్రెస్ కార్యకర్తల తీరు ఎలా ఉన్నప్పటికీ వారి నిరసన జాతి ప్రయోజనాలకు ఏ విధంగానూ వ్యతిరేకమైనది కాదు, దేశ ప్రతిష్ఠకు భంగకరమైనది కానే కాదు. ప్రజలు ఆగ్రహావేశాలతో నిర్వహించే నిరసన ప్రదర్శనలకు వలస పాలకులు, నిరంకుశ ప్రభు త్వాలు మాత్రమే భయపడతాయి. ఏఐ సదస్సు వద్ద నిరసన ప్రదర్శన కారణంగా అరెస్టయిన కాంగ్రెస్ కార్యకర్తలలో కొంత మంది ఇప్పటికీ జైలులోనే ఉన్నారు. వారికి బెయిల్ మంజూరు చేసేందుకు కోర్టు ఆమోదించడం లేదు. ఇరుగుపొరుగువారి భూములలోకి ప్రవేశించడం, వాటిని స్వాధీనం చేసుకోవడం, అక్కడి చెట్టూ చేమా, కొండా కోనా, వాగు, వంక, నదిని, మరీ ముఖ్యంగా తోటి పౌరుల జీవనరీతులను ధ్వంసం చేయడం... ఇదంతా ఊరి ప్రజల శ్రేయస్సుకు, దేశ ప్రయోజనాలకు అని గంభీరంగా చెప్పడమనేది వలసవాద?పెట్టుబడిదారీ వ్యవస్థల మరో కుతంత్రం. గ్రేట్ నికోబార్ దీవిలో ఇప్పుడు జరుగుతున్నది కూడా ఇదే సుమా! ఆ దీవిలో, 130 చదరపు కిలోమీటర్ల అటవీ భూమితో సహా 166 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలోని భూములలో పర్యావరణాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. ప్రభుత్వం ఈ నిర్వాకాన్ని చేసిన తీరు పూర్తిగా? అవును, ఎటువంటి మినహాయింపు లేకుండా, వలసపాలనా సంబంధితమైనదే. నిజమే, గ్రేట్ నికోబార్ మన భారత్‌లో భాగమే. అయితే ఆ దీవి, అక్కడి ప్రజలు ప్రభుత్వాల సంరక్షణలో ఉంటూ వచ్చారు. వారికి రక్షణ కల్పించడమంటే వారి జీవనరీతులు, పర్యావరణాన్ని అర్థం చేసుకోవలసిన అవసరమున్నది.

# 33వ వార్డులో ఆన్‌లైన్ వైసీపీ క్యాడర్ రిజిస్ట్రేషన్

## - పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వైఎస్ఆర్సిపి మరింత బలోపేతం చేసే విధంగా దక్షిణ నియోజకవర్గంలో క్యాడర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసు పల్లి గణేష్ కుమార్ అన్నారు. ఈ నేపథ్యంలో 33 వ వార్డు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆన్లైన్ ప్రక్రియ విధానాన్ని వాసుపల్లి నేరుగా పరిశీలించారు. పలు సూచనలు సలహాలు తెలియజేస్తూ అధిష్టానం ఆదేశాల మేరకు త్వరితగతిన పూర్తి చేయాలని వెల్లడించారు. ప్రతి కార్యకర్తకు వైసీపీలో గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. క్యాడర్ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని అన్నారు. రానున్న జీవీఎంసీ ఎన్నికల్లో వైసిపి అఖండ విజయం సాధించే విధంగా ముందుకు వెళ్లాలన్నారు. క్యాడర్ రిజిస్ట్రేషన్‌ను ఆన్లైన్లో పొందుపరిచి 14 వార్డులో కూడా త్వరితగతన పూర్తి చేయాలని ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశించారు. తన చిన్న కుమారుడు సాకేత్, శ్రావణిల నూతన దంపతులను ఆశీర్వదించడానికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి, అధినేత జగన్మోహన్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన దక్షిణ నియోజకవర్గ వైయస్ఆర్సీపీ శ్రేణులకు పెద్దలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పత్చిరిపిల్లి రాము 33వ వార్డు సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పురుగుమందులతో విష ప్రభావం పట్ల అప్రమత్తత అవసరం

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** వరి పంటలో రసాయన పురుగు మందులు వాడడం వలన అలాంటి పంటలను పండించే రైతులకు విష ప్రభావ సమస్య ఎదురవుతుందని, వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి వి మురళీధర్ అన్నారు. సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడకంపై విష ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు. మందులను పిచికారి చేసే సమయాల్లో రైతులు స్పృహ కోల్పోవడం, తలనొప్పి, శ్వాస తీసుకోవడం ఇబ్బంది కలగడం, మైకం వంటి ఇబ్బం దులు ఏర్పడతాయి అన్నారు. అవి క్రమంగా దీర్ఘకాల వ్యాధులైన క్యాన్సర్, ప్రత్యుత్పత్తి లోపాలు, కిడ్నీ లోపాలకు దారి తీస్తుందన్నారు. వీటిని నివారించు కునేందుకు రైతులు పురుగుమందులు పిచికారి చేసే సమయంలో రక్షణ దుస్తులు ధరించడం, మాస్కులు, చేతులకు గ్లౌజులు ధరించడం, పిచికారి అనంతరం చేతులను శుభ్రం చేసుకోవడం, రసాయన పురుగు మందులకు బదులు జీవ నియంత్రణ ద్రావణాలను ఉపయోగించాలన్నారు. డబ్బాలపై ఉన్న గుర్తులను చూసి అది ఎలాంటి విష ప్రభావం కలిగినదో మొదట రైతులు తెలుసుకొని మందును బట్టి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఐపిఎం



కిట్టులను పొలంబడి రైతులకు అధికారులు పంపిణీ చేశారు. ఈ పొలంబడి కార్యక్రమంలో ఏఈఓ జి రూప, విఏఏ మణికంఠ, ప్రవీణ్, రైతులు పాలచర్ల వీర్రాజు, గుమ్మల్ల వీరకుమార్, గుణ్ణం శేషయ్య, దేసిన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలి : పడాల రఘు





**కరప, (రాజధాని వార్తలు):** సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినం మొదలుకొని శ్రీరామనవమి వరకు అన్ని గ్రామాల్లో ధార్మిక సంఘాల ఆధారంగా వసంత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు పిలుపునిచ్చారు. కరప మండలం పెనుగుదురులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందువులకు నిజమైన నూతన సంవత్సరం ఉగాది మాత్రమేనని తెలిపారు. ఈ సందర్భంగా 'మన ఊరు – మన గుడి' కార్యక్రమంలో భాగంగా వసంత నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు గ్రామ దేవాలయాల్లో నిర్వహించాలని సూచించారు. ఉత్సవాల మొదటి రోజు పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీతో కార్యక్రమాలు ప్రారంభించి, తర్వాత రోజువారీగా భజనలు, సామూహిక హారతి, సత్సంగం, గ్రామ సంకీర్తన, విజయ మహా మంత్ర జపం ('శ్రీ రామ జయ రామ జయ జయ రామ' 108 సార్లు), హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరామ పారాయణం, సీతారామ కళ్యాణం వంటి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించబడిన దేవాలయాల అర్చకులు ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కట్టా బంగార్రాజు, కుంచె రామచంద్రరావు, బత్తిన నాగేశ్వరరావు, ముమ్మిడి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన పూర్తి..ఎన్నిక లాంఛనమే

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** రాజ్యసభ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పత్రాలు పరిశీలన శుక్రవారం పూర్తయింది. ఈ సందర్భంగా ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన సాయి అనే వ్యక్తి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. రాజ్యసభ అభ్యర్థిగా బలపరుస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు నామినేషన్ పత్రాలు ఉండాలని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. కానీ ఆ సంతకాలు సాయి దాఖలు చేసిన నామినేషన్ పత్రాలపై లేవని అధికారులు వివరణ ఇచ్చారు. అందువల్ల ఈ పత్రాలను తిరస్కరించినట్లు వారు తెలిపారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. అభిషేక్ సింఘ్వీకి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వరుసగా మరోసారి అవకాశం కల్పించింది. ఇక వేం నరేందర్ రెడ్డిని తొలిసారిగా రాజ్యసభకు ఎంపిక చేసింది. అసలు అయితే రాజ్యసభ సీటు ఒకటి అభిషేక్ మను సింఘ్వీకి కేటాయిస్తున్నట్లు





పార్టీ అధిష్ఠానం గతంలో ప్రకటించింది. ఇక మరో రాజ్యసభ పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో చాలా మంది పోటీ పడ్డారు. దాదాపు 16 మందితో కూడిన జాబితాను సిద్ధం చేసి .. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తీసుకు వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతో చర్చించి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని ఎంపిక చేశారు. వివాదరహితుడు కూడా కావడంతో.. ఆయన వైపు అధిష్ఠానం మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

# ఢిల్లీలో రైసినా డైలాగ్ 2026 సదస్సుకు సీఎం చంద్రబాబు

## - సాంకేతికత- సుపరిపాలనపై సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగం

## - సదస్సులో పాల్గొననున్న 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు



**అమరావతి, (రాజధాని వార్తలు):** దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం హాజరు కానున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో సాంకేతికత – సుపరిపాలన, భవిష్యత్ అంశాలపై సీఎం కీలక ఉపన్యాసం చేయనున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ– అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తున్నాయి. ఇందులో పాల్గొనేందుకు రేపు ఉదయం 10.50 గంటలకు సీఎం విజయవాడ నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. మద్యాహ్నం 2 గంటలకు ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరిగే రైసినా డైలాగ్ 2026 సదస్సుకు ముఖ్యమంత్రి హాజరవుతారు. అనంతరం ఆయన అమరావతి తిరిగి రానున్నారు. 2016 నుంచి ఎంఓఈఏ– ఓఆర్ఎఫ్ సంస్థలు రైసినా డైలాగ్ పేరిట ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. ప్రపంచ రాజకీయాలు– అంతర్జాతీయంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ స్థాయిలో చర్చించే అత్యున్నత వేదికగా రైసినా డైలాగ్ సదస్సుకు మంచి పేరుంది. వివిధ దేశాల అధినేతలు, మంత్రులు, అత్యున్నత సైనిక అధికారులు, విధానకర్తలు, మేధావులు, నిపుణులు ఒకే వేదికపై గ్లోబల్ వ్యూహాలను చర్చించేలా ఈ సదస్సు జరగనుంది. అంతర్జాతీయంగా పేరొందిన మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్సులాంటి ప్రతిష్టాత్మక వేదికల సరసన రైసినా డైలాగ్ నిలుస్తోంది. ఈ ఏడాది జరగనున్న 11వ ఎడిషన్ రైసినా డైలాగ్ సదస్సు సంస్కార– అన్వేషణ, సమన్వయం, పురోగతి అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ రైసినా డైలాగ్ సదస్సులో కీలకోపన్యాసం చేస్తారు. దేశంలో అభివృద్ధి పథాన నడుస్తున్న రాష్ట్రంగా ఏపీలో అమలు చేస్తున్న సుపరిపాలన– డిజిటల్ అంశాలపై ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా ఆధారిత విధాన నిర్ణయాల ద్వారా ప్రజలకు అందుతున్న మెరుగైన పౌరసేవల గురించి ఈ సదస్సులో ప్రస్తావించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ ఆవిష్కరణల కేంద్రంగా, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ డెస్టినేషన్‌గా మార్చేందుకు అనుసరిస్తున్న దార్శనిక నిర్ణయాలను ప్రపంచ దేశాల ముందు ఉంచనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎకోసిస్టమ్స్, డేటా సెంటర్లు, క్లీన్, గ్రీన్ ఎనర్జీ, నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ కారిడార్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు. పాలనకు సాంకేతికతను జోడించి ఆర్థిక వృద్ధిని ఎలా వేగవంతం చేయవచ్చన్న అంశాలతో పాటు పాలనలో పారదర్శకత, సంపద సృష్టి, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ వంటి వినూత్న అంశాలపై అంతర్జాతీయ ప్రతినిధులతో తన అనుభవాలను ముఖ్యమంత్రి పంచుకోనున్నారు.

# మార్చి 25న షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ సమావేశం

## - సెక్రటరీ జనరల్ టు లెజిస్లేచర్ సూర్యదేవర ప్రసన్నకుమార్

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ శాసనసభకు చెందిన 'షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ' సమావేశం మార్చి 25వ తేదీ, బుధవారం ఉదయం 11:00 గంటలకు, వెలగపూడి అమరావతిలోని అసెంబ్లీ భవన్ లో గల కమిటీ హాల్ నెం.1లో జరగనుందని సెక్రటరీ జనరల్ టు లెజిస్లేచర్ సూర్యదేవర ప్రసన్నకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో రాష్ట్రంలోని షెడ్యూల్డ్ తెగల సంక్షేమం కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారని సెక్రటరీ జనరల్ టు లెజిస్లేచర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# నిహారిక 'రాకాసా'.. ఫస్ట్ సింగిల్ ఎప్పుడంటే?




టాలీవుడ్‌లో తనదైన కామెడీ టైమింగ్ తో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో సంగీత్ శోభన్ ఇప్పుడు మరో కొత్త కాన్సెప్ట్ తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించిన ఆయన, ఈసారి హారర్ కామెడీ ఎంటర్టైనర్ రాకాసా మూవీతో థియేటర్లలోకి రాబోతున్నారు. మానస శర్మ దర్శకత్వంలో రూపొందుతున్న ఆ సినిమాను నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సాల్ నిర్మిస్తున్నారు. సమ్మర్ కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని చిత్రబృందం సిద్ధమవుతోంది. ప్రమోషన్లలో భాగంగా ఇటీవల విడుదల చేసిన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. ఇప్పుడు మరో అప్డేట్ ను మేకర్స్ వెల్లడించారు. చిత్రంలోని ఫస్ట్ సింగిల్ ను విడుదల చేయనున్నట్లు స్పెషల్ వీడియో ద్వారా తాజాగా సోషల్ మీడియాలో ప్రకటించారు. ంటలవతీబితిబవఎవనిబి మార్చి 7న రాకాస చిత్రంలోని తొలి పాటను విడుదల చేయనున్నట్లు తెలిపారు. రాకాసా ప్రపంచం నుంచి వస్తున్న హార్ట్ బ్రేక్ సాంగ్ మీ ప్లే లిస్ట్‌లో చోటు సంపాదించేందుకు సిద్ధమైందని చెప్పారు. మార్చి 7న Rapappa తో మీ హృదయాలను కదిలించేందుకు, అలాగే డ్యాన్స్ చేయించే మ్యూజిక్‌తో రావడానికి సిద్ధంగా ఉండండంటూ మేకర్స్ పోస్టు చేశారు. అయితే ఫస్ట్ సింగిల్ అనౌన్స్మెంట్ కోసం విడుదల చేసిన స్పెషల్ వీడియో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సంగీత్ శోభన్ తన గదిలో ఉండగా బయట నుంచి పలువురు పిలుస్తుంటారు. అప్పుడే గెటప్ శ్రీను లోపలికి వచ్చి "ఏంటి బావా? కొంగను చూస్తున్నావా?" అని సరదాగా అడుగుతాడు. దానికి సంగీత్ శోభన్ "అది ఇన్ స్టాలో ఫేమస్ అయిన పెంగ్విన్ బావా? ఆ పెంగ్విన్ నేనే బావ" అంటూ వీడియో చూపిస్తాడు. "చూడు ఎలా ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లిపోతుందో" అంటూ తన పరిస్థితిని సరదాగా చెప్పుకుంటాడు. అదే సమయంలో ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్ ఎలిమెంట్స్ ఎలా మారిపోయాయో గెటప్ శ్రీను చెప్పే సన్నివేశాలు నవ్వులు పూయిస్తాయి. ఆ తర్వాత "నీ బాధ ఏంటి బావా?" అని అడిగితే "నా బాధ మర్చిపోయావా? నా హార్ట్ బ్రేక్ బాధను ఆడియన్స్‌కు అంటించేద్దాం అనుకుంటున్నా" అంటూ సంగీత్ శోభన్ చెప్పే డైలాగ్ ఫన్నీగా ఉంటుంది. ఇక వాలెంటైన్స్ డే ఇటీవలే ముగిసిందని గుర్తు చేస్తూ, దానికి సరిపోయేలా ఒక హార్ట్ బ్రేక్ సాంగ్ ను ప్లాన్ చేశానని సంగీత్ శోభన్ చెబుతాడు. "ఇప్పుడు ఈ పాటను రిలీజ్ చేస్తే సింగిల్స్, లవర్స్ తట్టుకోలేరు బావా"అంటూ గెటప్ శ్రీను చెప్పే డైలాగ్ వీడియోలో హైలైట్‌గా నిలుస్తోంది. చివరలో హార్ట్ బ్రేక్ యాంథమ్‌తో అందరినీ ఏడిపించేస్తా అంటూ సంగీత్ శోభన్ చెబుతూ సినిమా విడుదల తేదీని మరోసారి గుర్తు చేస్తారు. మరి మార్చి 7న విడుదల కానున్న రాకాసా ఫస్ట్ సింగిల్‌కు ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో వేచి చూడాలి.

# పెద్ది.. అచ్చియమ్మ సర్ ప్రైజ్




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లీడ్ రోల్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ పెద్దిపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రూపొందుతున్న ఆ సినిమాలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉండగా.. ప్రమోషన్లు జోరుగా జరుగుతున్నాయి. శుక్రవారం (మార్చి 6) జాన్వీ కపూర్ పుట్టినరోజు సందర్భంగా పెద్ది మూవీ టీమ్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ సందర్భంగా ఆమె పాత్రకు సంబంధించిన స్పెషల్ వీడియోను విడుదల చేసింది. ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన దర్శకుడు బుచ్చిబాబు సానా జాన్వీ కపూర్‌కు బర్త్ డే విషెస్ చెబుతూ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టారు. "మీతో కలిసి పని చేయడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. సినిమాలో మీ పవర్ ఫుల్ పాత్రను ప్రేక్షకులు వెండితెరపై చూసే రోజు కోసం నేను కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను" అని పేర్కొన్నారు. అయితే సినిమాలో జాన్వీ అచ్చియమ్మ అనే పాత్రలో కనిపించనుంది. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన యువతిగా ఆమె పాత్రను దర్శకుడు రూపొందించినట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్, చికిరి సాంగ్ ద్వారా జాన్వీ పాత్రకు మంచి రెస్పాన్స్ లభించింది. ఆ పోస్టర్‌లో జాన్వీ సంప్రదాయ దుస్తుల్లో కనిపిస్తూ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. తాజాగా విడుదలైన బర్త్ డే స్పెషల్ గ్లింప్స్‌లో కూడా ఆమె లుక్ ఆకర్షిస్తోంది. వీడియోలో జాన్వీ కనిపించే విజువల్స్ ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. గ్రామీణ నేపథ్యంలో ఉండే యువతిగా ఆమె పాత్ర మాస్ టచ్‌తో ఉంటుందనే తెలుస్తోంది. చీరలో సంప్రదాయంగా కనిపిస్తూ, కళ్లద్దాలు పెట్టుకుంటున్న చిలిపి యువతిగా ఆమె లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో పెద్ది సినిమాలో జాన్వీ పాత్రపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి పెరిగింది. అయితే ఆ మూవీ విలేజ్ బ్యాక్ డ్రాప్‌తో సాగే రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. 1980ల కాలాన్ని నేపథ్యంగా తీసుకుని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం ఇప్పటికే తెలిపింది. విలేజ్ స్పోర్ట్స్, ఎమోషన్స్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండనుందని సమాచారం. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, టాలీవుడ్ నటుడు జగపతి బాబు, బాలీవుడ్ నటుడు బొమ్మన్ ఇరానీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో వృద్ధి సినిమాస్ నిర్మిస్తోంది. అన్ని పనులు పూర్తిచేసుకుని మూవీ ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి భారీ అంచనాల మధ్య విడుదలకు సిద్ధమవుతున్న పెద్ది బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.


# సల్మాన్ ఖాన్ సినిమా నిర్మాతగా సమంత!





సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో ఓ హై కాన్సెప్ట్ సూపర్ హీరో చిత్రానికి సన్నాహకాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. స్క్రిప్ట్ లాక్ అయింది. ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో కాకుండా తక్కువ బడ్జెట్‌తో సింపుల్‌గా పూర్తి చేయాలన్నది సల్మాన్ కాన్సెప్ట్. భారీ బడ్జెట్ వెచ్చించి నిర్మాతలకు నష్టాలు తేవడం ఎంత మాత్రం ఇష్టం లేక సల్మాన్ ఖాన్ ప్రాజెక్ట్ సైన్ చేయడానికి ముందే ఈ కండీషన్ పెట్టారు. ఈ చిత్రాన్ని టాలీవుడ్ అగ్రగామి నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, రీల్ లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి నిర్మించడం విశేషం. అయితే ఈ సినిమా నిర్మాణంలో సమంత కూడా భాగస్వామిగా చేరుతుందని సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది. భారీ బడ్జెట్ సినిమా కాదు కాబట్టి సామ్ తనవంతు పెట్టుబడిగా కొంత పెడతానని మైత్రీతో ఒప్పందం చేసుకుందని వినిపిస్తోంది. ఇప్పటికే సమంతా ట్రాలాలా మూవీంగ్ పిక్చర్స్ అనే నిర్మాణ సంస్థను స్థాపించి తెలుగులో సినిమాలు నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే. కంటెంట్ ఓరియేంటెడ్ సినిమాల్ని యువనటీనటులతో నిర్మిస్తూ ప్రోత్సహిస్తుంది. తొలి ప్రయత్నంగా 'శుభమ్' అనే చిత్రాన్ని నిర్మించి విమర్శకుల ప్రశంసలందుకుంది. ప్రస్తుతం తానే ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న 'మా ఇంటి బంగారం' అనే మరో చిత్రాన్ని స్వయంగా నిర్మిస్తోంది. ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమాతోనే సమంత కంబ్యాక్ అవుతోంది. ఇదే సమయంలో బాలీవుడ్ దర్శక నిర్మాత రాజ్ నిడిమోరును అమ్మడు ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. పెళ్లైన తర్వాత రాజ్ నిడిమోరు దర్శకత్వం వహిస్తోన్న తొలి చిత్రం సల్మాన్ ఖాన్‌దే కావడం విశేషం. అలా భర్త సహకారం కూడా సమంతకు లభించడంతో ఈ సినిమా నిర్మాణంలో భాగమవుతున్నట్లు తెలుస్తుంది. బడ్జెట్‌కు సంబంధించిన వ్యవహారాలు కూడా రాజ్ అండ్ డీకే దగ్గరుండి చూసుకుంటున్నారు. ఆ బాధ్యతలు సల్మాన్ ఖాన్ దర్శకులకే అప్పగించారు. మైత్రీ-రీల్ లైఫ్ ఎంటర్ టైన్ మెంట్స్ అన్నవి దర్శకులు అడిగినంత బడ్జెట్ సమకూర్చడమే వాళ్ల పని. నిర్మాణ పరంగా ఆ రెండు నిర్మాణ సంస్థలు ఎక్కడా రాజీ పడేవి కాదు. ఎన్ని కోట్లు అయినా తెచ్చి పెట్టగల సంస్థలు. అలాంటి నిర్మాణ సంస్థలతో సమంత ట్రాలాలా మూవీంగ్ పిక్చర్స్ ఒప్పందం చేసుకోవడం ఆసక్తికరం. అయితే ఈ మూడు సంస్థలు ఎంత పర్సంటేజ్ చొప్పున పెట్టుబడి పెడుతున్నాయి. అన్నది క్లారిటీ రాలేదు. తొలుత ట్రాలాలా భాగస్వామ్యంలో లేదు కాబట్టి రెండు సంస్థలు 50-50 షేర్ లో పెట్టుబడి పెట్టేవారు. కానీ ఇప్పుడు ట్రాలాలా చేరింది కాబట్టి వాటా లెక్కలు తేలాల్సి ఉంది.

# రౌడీ స్టార్ ఆ ఇద్దరికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తున్నాడా?



టాలీవుడ్ స్టార్ హీరోలు కొంతమంది ఒక్కో పాన్ ఇండియా మూవీతో బిజీ బిజీగా గడిపేస్తుంటే టైర్ 2 హీరోలు మాత్రం బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తూ క్రేజీ లైనప్‌ని రెడీ చేసుకుంటున్నారు. ఒక్కో హీరో మూడు నుంచి నాలుగు సినిమాలని లైన్‌లో పెట్టేసుకుంటున్నాడు. ఈ జాబితాలో నిలుస్తున్న స్టార్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ. మునుపెన్నడూ లేనంతగా క్రేజీ ప్రాజెక్టుల విషయంలో స్పీడు పెంచేశాడు. బ్యాక్ టు బ్యాక్ భారీ క్రేజీ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తున్నాడు. ప్రస్తుతం విజయ్ తేరవకొండ రెండు భారీ సినిమాల్లో నటిస్తున్నాడు. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న 'రౌడీ జనార్థన' ఒకటి కాగా రాహుల్ సంక్రీత్యన్ దర్శకత్వంలో నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. 90వ దశకం నేపథ్యంలో సాగు పొలిటికల్ యాక్షన్ డ్రామాగా రవికిరణ్ కోల 'రౌడీ జనార్థన'ని రూపొందిస్తున్నాడు. కరుగుగట్టిన రౌడీగా పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో విజయ్ దేవరకొండ నటిస్తున్న సినిమా ఇది. మేకోవర్, క్యారెక్టర్ డిజైన్, డైలాగ్ డిక్షన్ సరికొత్తగా ఉండే సినిమా ఇది. కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీ ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఈ మూవీతో పాటు భారీ పాన్ ఇండియా మూవీగా 'రణబాలి' రూపొందుతోంది. ప్రీ ఇండిపెండెన్స్ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఇది. స్వాతంత్రానికి పూర్వం ఓ యువకుడు సాగించిన పోరాటం నేపథ్యంలో దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఐదు భాషల్లో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ కానుంది. ఈ రెండు సినిమాలు షూటింగ్ చివరి దశకు చేరుకుని రిలీజ్‌కు రెడీ అవుతున్న నేపథ్యంలో విజయ్ దేవరకొండ తదుపరి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాడు. ఈ రెండు క్రేజీ పాన్ ఇండియా మూవీస్ తరువాత మరో రెండు భారీ ప్రాజెక్టులకు విజయ్ దేరవకొండ గ్రీన్ సిగ్నల్ ఇవ్వబోతున్నట్టుగా తెలిసింది. ఇందులో ఒకటి విక్రమ్ కె కుమార్ డైరెక్షన్‌లో ఓ భారీ మూవీకి శ్రీకారం చుట్టబోతున్నాడు. ఈ ప్రాజెక్ట్‌ని గీతా ఆర్ట్స్ సంస్థ అత్యంత భారీ స్థాయిలో నిర్మించబోతోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే బయటికి రానుంది. దీనితో పాటు తాజాగా మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు రౌడీ హీరో గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నాడని తెలిసింది. నేచురల్ స్టార్ నానితో రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామా 'హయ్ నాన్న'ని రూపొందించి దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకున్న శౌర్యవ్ ఇటీవలే విజయ్ దేవరకొండకు స్క్రిప్ట్ వినిపించాడట. స్టోరీ నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. అన్ని కరెక్ట్‌గా కుదిరితే ఈ మూవీని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మించనుందని ఇన్ సైడ్ టాక్. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలిసింది.

# నియోజక వర్గాలలో గుర్తించిన అవసరాలపై సవివరంగా నివేదికలివ్వండి : జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి






**విజయనగరం, (రాజధాని వార్తలు):** నియోజక వర్గాలలో శాసన సభ్యులు గుర్తించి పరిష్కరించమని కోరిన పనులకు, ప్రాజెక్టులకు శాఖల వారీగా సవివరమైన నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. నియోజక వర్గం వారీగా శాసన సభ్యులు పెట్టుకున్న వినతులలో ముఖ్యమైన వాటిని, ఆర్థికపరంగా మంజూరులు చేయవలసిన పనులకు, ప్రాజెక్టులకు ఎంతెంత ఖర్చు అవుతుంది, దానివలన ఎంతమందికి ప్రయోజనం చేకూరుతుంది వంటి అంచనాలతో కూడిన నోట్స్‌ను వివరంగా ఆయా శాఖలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే మంజూరైన పనులకు నిధులు రాకుండా ఉన్న వాటి వివరాలను కూడా పొందుపర్చలన్నారు. త్వరలో ముఖ్యమంత్రితో జిల్లా అభివృద్ధి పై. ప్రజాప్రతినిధులు, ఇంచార్జ్ మంత్రి, జిల్లా కలెక్టర్‌తో సమావేశం ఉన్నందున ఈ వివరాలన్నింటిపై 1 పేజీ నోట్స్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ సేదు మాధవన్, సి.పి.ఓ బాలాజీ, ఆర్ అండ్ బి, ఆర్.డబ్ల్యు.ఎస్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, వైద్య ,విద్య ఉద్యాన, వ్యవసాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పురిటిపెంట జంక్షన్ వద్ద నాకాబంది

## - ముమ్మరంగా వాహన పత్రాల తనిఖీ - గంజాయి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు : ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ ఆదేశాల మేరకు గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి ఏ వి రమణ ఆధ్వర్యంలో గురువారం నాడు గజపతినగరం మండలం పురిటి పెంట గ్రామ జంక్షన్ దగ్గర నాకాబంది నిర్వహించడం జరిగిందని స్థానిక ఎస్సై కే కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కే కిరణ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వాహనాలను సీజ్ చేస్తామని అన్నారు. అదేవిధంగా వాహనదారులు సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే అటువంటి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుంది అని ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు హెచ్చరించారు. గజపతినగరం సర్కిల్ పరిధిలో గల ఐదు పోలీస్ స్టేషన్‌లలో నాకాబంది నిర్వహించడం జరిగింది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రేషన్ పంపిణీలో పారదర్శకత ఉండాలి

## - జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి



**గరుగుబిల్లి, (రాజధాని వార్తలు):** కార్డుదారులకు పంపిణీ చేసే రేషన్‌లో పారదర్శకతను పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా గరుగుబిల్లి మండలంలోని శివ్వాం మరియు గొట్టివలస గ్రామాల్లో గల ప్రభుత్వ చౌకధరల దుకాణాలను జాయింట్ కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, సరుకుల నిల్వలు మరియు బయోమెట్రిక్ విధానాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కార్డుదారులకు పంపిణీ చేస్తున్న బియ్యం మరియు ఇతర నిత్యావసర వస్తువుల నాణ్యతను జె.సి.స్వయంగా పరిశీలించారు. నాణ్యతలో ఎటువంటి రాజీ పడకూడదని డీలర్లను ఆదేశించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ సరుకులు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సక్రమంగా అందాలని, సరుకులు పక్కదారి పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామస్తులతో మాట్లాడి, రేషన్ పంపిణీలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తూకంలో తేడాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ-పాస్ యంత్రాల పనితీరును మరియు స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు, పౌర సరఫరాల శాఖ సిబ్బంది మరియు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విక్రమపురం పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

## - విద్యార్థులతో ముచ్చటించి విద్యా ప్రమాణాలు పరిశీలన - పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉద్బోధ

**కొమరాడ, (రాజధాని వార్తలు):** కొమరాడ మండలం విక్రమపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని, తరగతి గదులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పదవ తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, విద్యాప్రమాణాలను పరీక్షించేందుకు పలు ప్రశ్నలు వేసి, విద్యార్థుల ప్రతిస్పందనలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరగనున్న ఎస్ఎస్సీ బోర్డు పరీక్షల్లో విద్యార్థులందరూ అద్భుతమైన ప్రతిభ కనబరచాలని, వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించడం ద్వారా జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకు రావాలని ఆకాంక్షించారు. గత మూడేళ్లుగా 10వ తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో ఉందని, ఈ ఏడాది కూడా జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహ్లాద వాతావరణం కనిపించాలని అన్నారు. ముఖద్వారం నుంచి తరగతి గదుల వరకు పచ్చదనం కనిపించాలని తెలిపారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందేలా చూడాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, మండల విద్యా శాఖాధికారి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిష్ఠాత్మకంగా జనగణన

## - శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 16వ జనాభా గణన ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కోరారు. చింతలవలస లోని ఎం.వి.జి.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మొదటి దశ 'గృహాల జాబితా మరియు గృహ వసతుల గణన' మూడవరోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శిక్షణ తీరును పరిశీలించారు. వివిధ అంశాలపై వారి అవగాహనా స్థాయిని పరీక్షించారు. సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ జనగణన సమర్ధవంతంగా పూర్తి చేసేందుకు సిద్ధం కావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ మూడు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకొని, జనగణన డేటా సేకరణపై అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవడమే కాకుండా, సందేహాలను పూర్తిగా నివృత్తి చేసుకోవాలని సూచించారు. బ్లాక్‌లను ఏర్పాటు చేయడం, మ్యాపుల్లో గ్రామ సరిహద్దులను నిర్ణయించడం, జనాభా అంచనా వేయడం తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జనగణన జాయింట్ డైరెక్టర్, సి.పి.ఓ బాలాజి, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, శిక్షకులు పాల్గొన్నారు.

# గజపతినగరం సర్కిల్లో "నాఖ బంది"

## - ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే అటువంటి వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదు - సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.ఏ.వి.రమణ, సబ్ ఇన్స్పెక్టర్ యు.మహేష్








**బొండపల్లి (గజపతినగరం), (రాజధాని వార్తలు):** జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ ఆదేశాల మేరకు గజపతినగరం సర్కిల్ పరిదిలో ఐదు ప్రాంతాలలో నాఖబంధీని నిర్వహించడం జరిగిందని సర్కిల్ ఇన్స్పెక్టర్ జిఏవి రమణ విలేకరులకు తెలియజేశారు. ఈ నాఖబందిలో వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించడం జరిగిందని సి.ఐ జి.ఏ.వి రమణ అన్నారు. ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో 11 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఆయన అన్నారు. సర్కిల్ పరిధిలో గల బొండపల్లి పోలీస్ స్టేషన్ జంక్షన్ వద్ద, గజపతినగరం పోలీస్ స్టేషన్ పురిటిపెంట జంక్షన్ వద్ద, మానాపురం పోలీస్ స్టేషన్ గర్భం జంక్షన్ వద్ద, బూర్జి వలస, ఆంధ్ర పోలీస్ స్టేషన్ల పరిధిలో నాకాబంది నిర్వహించడం జరిగిందని సీఐ రమణ అన్నారు. ఈ సందర్భంగా సి.ఐ జి ఏ వి రమణ మాట్లాడుతూ ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జరిమానాలే కాకుండా జైలు శిక్ష కూడా పడుతుందని సి.ఐ జి.ఏ.వి రమణ హెచ్చరించారు. ఈ నాకాబందిలో బొండ పల్లి ఎస్.ఐ యు.మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవంతమైన ఉచిత నేత్ర వైద్య శిబిరం

## - ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్









**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఐ కేర్‌లు సంయుక్తంగా గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైందని నిర్వాహకులు విలేకరులకు తెలియజేశారు. స్థానిక నేత్రాలయ ఐ కేర్ వద్ద శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సౌజన్యంతో జరిగిన ఈ శిబిరంలో ఆప్తోమెట్రిసియన్ దీపక్ తనిఖీలు నిర్వహించారు. 87 మంది కంటి రోగులకు పరీక్షలు జరపగా,39 మందిని కేటరాక్ట్ సర్జరీకి ఎంపిక చేశారు. వీరందరిని బస్ ద్వారా తీసుకుని వెళ్లి కళ్ళకు శాస్త్ర చికిత్సలు చేయించడం జరుగుతుందని ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాయి కుమార్, రేవంత్ అన్నారు.

గజపతినగరం కమ్యూనిటీ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొని శిబిరం జరుగుతున్న తీరును పరిశీలించారు. అదేవిధంగా శిబిరానికి వచ్చిన వారందరికీ సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ వారు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐ కేర్ నిర్వాహకురాలు మౌనిక, క్యాంప్ సమన్వయకర్త వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఎరుపెక్కిన మార్కెట్....యార్డుకు చేరిన 40 వేల బస్తాల మిర్చి

**వరంగల్, (రాజధాని వార్తలు):** వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఎరుపెక్కింది. గురువారం సుమారు 35 నుంచి 40వేల బస్తాల మిర్చి అమ్మకానికి వచ్చింది. ఈ సీజన్‌లో ఇదే అ ధికం. దీంతో యార్డులో ఎటు చూసినా మిర్చి బస్తాలే దర్శన మిచ్చాయి. మిర్చి ధరలు గత సంవత్సరంతో పోలిస్తే మెరుగ్గా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మార్కెట్‌లో మంచి నాణ్యత ఉన్న మిర్చికి గరిష్టంగా పలికిన ధరలు ఇలా ఉన్నాయి... తేజ రకం మిర్చి క్వింటాకు రూ.18,800, వండర్‌హాట్ రూ. 35 వేలు, యూఎస్.341 రూ.21 వేలు, దీపిక రూ. 30వేలు, ఎల్లోమిర్చి రూ.20 వేలు, సింగిల్‌పట్టి రూ.40 వేలు, దేశీ మిర్చి రూ.40 వేలు, తాలు క్వింటాకు రూ. 12 వేలు పలికింది.



# డాక్టర్ స్వప్న హైందవికి మహిళా దినోత్సవ పురస్కారం





**విజయనగరం, (రాజధాని వార్తలు):** మహిళా సాధికారితకు సమానత్వమే పునాది అని ప్రముఖ సాహితీవేత్త, శ్రీ వాగ్దేవీ సమారాధనమ్ వ్యవస్థాపకురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో దిసన్ స్కూల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ అవసరానికి ఆసరాగా నిలిచే ధీరత్వం, ఎంతటి క్లిష్ట పరిణామాలనైనా ఎదుర్కొనే నేర్పరితనం, భూమాతకే అబ్బురం అనిపించేంత సహనం మహిళల స్వంతం అని అన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గురుప్రసాద్ మాట్లాడుతూ స్త్రీ మూర్తి పురుషుడి వెనుక ఉంటే బలం, ముందు ఉంటే కవచం. పక్కనే ఉంటే జీవితాన్ని వసం తంగా మార్చేసే అద్భుతమని అన్నారు. ఆమె మౌనంతో మాట్లాడ గలదు. నిశ్శబ్దానికి టీకా రాయగలదు. అక్షరాలకు అతీతమైన భాషలో మహిళ మహాపండితురాలని పేర్కొన్నారు. జననియే జగతికి ఆధారం పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా తుని ఛాంబర్ ఆఫ్ కామర్స్ పూర్వ అధ్యక్షులు పెనుగొండ కామ రాజు, సన్ స్కూల్ కరస్పాండెంట్ మామిడిపాక అనిల్ కుమార్, పిన్నింటి కళావతిలతో కలసి జ్యోతి ప్రజ్వలనం చేసారు. ఈ సందర్భంగా లయ లాస్య డాన్స్ అకాడమీ విద్యార్థులు, అభినయ కళాక్షేత్రం విద్యార్థులు తమ నృత్య ప్రదర్శనలతో అలరించారు. ప్రముఖ గాయనీమణులు శైలజా కుమారి, ఎం హాసిని తమ గాత్రంతో ఆకట్టుకున్నారు. 2026 సంవత్సరానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ పురస్కారాన్ని డాక్టర్ స్వప్న హైందవికి ఏపి గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్, పెనుగొండ కామరాజుతో కలిసి ప్రదానం చేసారు. ఈ సందర్భంగా బాలరామాలయ నిర్మాత కుసుమంచి సుబ్బారా వుకు ఘనంగా సత్కరించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉత్తరాంధ్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి, సంఘం కార్యదర్శి సుభద్రాదేవి, తాడేపల్లి నాగేశ్వరరావు, డి వి సత్యనారాయణ, డిమ్స్ రాజులు ఉత్తమ విద్యార్థులకు పతకాలను, ప్రశంసా పత్రాలను ప్రదానం చేసారు. ఈ సమావేశంలో సన్ స్కూల్ డీన్ రంగా, అకడమిక్ కో ఆర్డినేటర్ వసుధ, శ్వేత, ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ గోటేటి హిమబిందు, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బి పనుల్లో వేగం పెంచాలి : జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి




**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** జిల్లాలో కొనసాగుతున్న రహదారులు, భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్ అండ్ బి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 1030 కిలోమీటర్ల మేర ప్రధాన రహదారుల నెట్‌వర్క్ ఉందని, ఇందులో 464 కి.మీ. స్టేట్ హైవేలు మరియు 566 కి.మీ. మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు ఉన్నాయని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ వార్షిక నిర్వహణ పనుల్లో భాగంగా మెజారిటీ పనులు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని త్వరితగతిన ముగించాలని సూచించారు. పార్వతీపురంలో నిర్మించతలపెట్టిన ఆర్ అండ్ బి ఇన్స్పెక్షన్ బంగళా ప్రాధాన్యతను కలెక్టర్ వివరిస్తూ, పీపీపీ భాగస్వామ్యంతో చేపట్టేలా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అలాగే బైపాస్ రోడ్డు మరియు వివిధ నదులపై నిర్మిస్తున్న హై లెవల్ బ్రిడ్జిల పనుల వివరాలను అధికారులు కలెక్టరుకు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ. 5435.66 లక్షల బడ్జెట్‌లో ఇప్పటికే రూ. 5372.66 లక్షలు ఖర్చు చేసినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. మార్చి 15 లోగా మిగిలిన నిధులను వినియోగించి, పెండింగ్‌లో ఉన్న బిల్లుల ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. కార్యాలయంలో ఉన్న సిబ్బంది కొరత కారణంగా పాలనాపరమైన ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో జరుగుతున్న ప్రత్యేక రహదారి అభివృద్ధి పనులు స్టేజ్ వారీగా పురోగతి ఉండాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇతర సహాయ ఇంజనీర్లు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆ సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి లేఖ




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న రూ. 1.85 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టుల కేటాయింపులు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి మీద ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు.

**2,800 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం..**

2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో 2,800 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మరో 2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. తద్వారా తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన జిల్లాలతో కలిపి మొత్తం 33 జిల్లాలు కూడా తక్కువ సమయంలోనే జాతీయ రహదారులతో అనుసంధానించామని.. ఇది చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూ.265 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్163 (గతంలో ఎన్‌హెచ్-202) మీద నగరంలోని అంబర్‌పేట క్రాస్ రోడ్డు వద్ద 1.5 కిలోమీటర్ల పొడవైన 4 వరుసల ఫ్లై ఓవర్‌ను నిర్మించిందని గుర్తు చేశారు. 5 మే, 2025 నాడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ ఫ్లై ఓవర్‌ను ఘనంగా ప్రారంభించారని అన్నారు.

**భూసేకరణ పూర్తి కాలేదు..**

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తనతోపాటుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఈ ఫ్లై ఓవర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తి కాలేదని అన్నారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగి, ప్రారంభోత్సవం కూడా పూర్తి చేసుకున్నప్పటికీ దీని కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తిస్థాయిలో జరగలేదని తెలిపారు. భూసేకరణ విషయంలో కొన్ని శక్తులు అడ్డుతగులుతోండటంతో అనవసరంగా తీవ్ర జాప్యం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఈ ఫ్లై ఓవర్ 2018లో మంజూరయినప్పటికీ లేని సమస్యలు సృష్టించి భూసేకరణ పూర్తి కాకుండా కుట్రలు చేసి సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో జరగనివ్వకపోవడంతో ఈ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

**ఈ సమస్య ఓ కొలిక్కి రాలేదు..**

ఈ విషయాన్ని అప్పటి సీఎం కె.చంద్రశేఖరరావు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి అనేకసార్లు తెలియజేశానని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ మంత్రులకు స్వయంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా అనేకసార్లు తెలియజేశారని అన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, ఇతర సంబంధిత అధికారుల దృష్టికి తాను కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లి అనేకసార్లు మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసినప్పటికీ, ఈ సమస్య ఓ కొలిక్కి రాలేదని చెప్పుకొచ్చారు. భూసేకరణకు సంబంధించిన భూమికి రూ. 2.54 కోట్ల పరిహారం లబ్ధిదారులకు ప్రభుత్వం చెల్లించినప్పటికీ మధ్య దళారులు అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ చూపించి, సర్వీసు రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత జీహెచ్ఎంసీ, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకొని సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించటానికి సహకరించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు.

# సుదర్శన నారసింహస్వామి వారికి క్షీరాధివాసం



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీశ్రీశ్రీ సుదర్శన నారసింహస్వామి వారి ఆలయ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం ప్రత్యక్ష వాస్తు రచన, అర్చనాది హోమం, ఛాయాధివాసం మరియు క్షీరాధివాసము, యాగశాలార్చన, నిత్య విశేష హోమములు, మూర్తి, కళా మరియు గళంత్రికా కుంభ మంటపావాహనలు, ధాన్యాధివాసము, వేద పారాయణ, యాగశాలార్చన, ప్రతిష్టా మూర్తులకు పంచామృతాభిషేకం, శుద్ధి, నిత్య విశేష హోమములు, చక్రాబ్జ మండలార్చన, వ్యాసపూర్వక హోమములు, మంగళాశాసనము గావించారు. వేదమంత్రాలు నడుమ జరిగిన ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులు దుర్గా అశ్విన్, స్వప్న, రమ్య, నీరజ మన్నే తదితరులు పాల్గొన్నారు.

# రేకుల షెడ్‌లో సర్కారు వారి బడులు





**పాచిపెంట, (రాజధాని వార్తలు):** పాచిపెంట మండలంలో బోర్రమామిడి పంచాయతీ పరిధిలో ఉన్న బొడ్డపాడు గిరిజన గ్రామంలో స్కూల్ బిల్డింగ్ నిర్మాణం వెంటనే చేపట్టాలని రేకుల షెడ్డు ముందు పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివాసి గిరిజనులైన సొయారి లక్ష్మణరావు, పోయి శ్రీరామ్ మాట్లాడుతూ. వర్షాకాలంలో పిల్లలు చదువుకోవడం చాలా కష్టంగా ఉందని గట్టిగా గాలి వేస్తే రేకులు ఎగిరిపోయి పిల్లలకు దెబ్బలు తగిలే అవకాశం ఉందని భయాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో స్కూలు పిల్లలకు ఎటువంటి ప్రమాదం కలగకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గిరిజనులు పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు మానుకొని విద్యారంగం అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. గిరి శిఖర గ్రామ ప్రాంతాల్లో ఉన్నటువంటి గిరిజనులు ఎటువంటి అవగాహన లేక, గిరిజనులు మూఢనమ్మకాలు, చేతబడి వంటి నమ్మకాలతో బ్రతుకుతున్నారు. గిరిజనులను చైతన్యవంతులుగా చేయాలంటే విద్య అనే ఆయుధం అవసరం. వారిలో చైతన్యం పెరగాలి అంటే బడులు తప్ప, చదువు తప్ప మరొక మార్గం లేదు. ప్రభుత్వాలు ఈ యొక్క సమస్యను గుర్తించి అధికారులు వెంటనే స్పందించవలసిందిగా కోరుతున్నాము.

అన్ని గిరిజన ప్రాంతాల్లో కూడా స్కూల్ బిల్డిం గులు నిర్మాణం మధ్యలో ఉన్నవి చేయాలని అన్నారు. ఒక్క బొడ్డ పాడు గ్రామం అనే కాదు, పాచిపెంట మండలంలో అల్లంపాడు, కేరింగి పంచాయతీలో కొన్ని గ్రామాలు అలా చూసుకుంటే దాదాపు 8 ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో స్కూలు బిల్డింగులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఎగువగొట్టూరు గ్రామంలో 60 మందికి పైగా ఉన్న స్కూలు పిల్లలు ఉంటే స్కూల్ బిల్డింగు ప్రహరీ గోడ లతో పాటు కట్టారని కానీ స్లాప్ వేయకపోవడం వలన రేకుల తోనే కాలయాపన చేస్తున్నారని ఈ విషయాన్ని ఎన్నోసార్లు అధికారులకు దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకున్నా పోతుందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గిరిజనుల పట్ల ,విద్య పట్ల నిర్లక్ష్య వైఖరిని మానుకోవాలని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పత్రికా ముఖంగా కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఈ యొక్క సమస్యలకు పరిష్కారాన్ని చూపించాలని గిరిజన నాయకులు సోయారి లక్ష్మణరావు, పోయి శ్రీరామ్ అన్నారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి






**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఇంటర్ మీడియట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక తోటపాలెంలోని శ్రీనివాస జూనియర్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు.

పరీక్ష వివరాలు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

అందుబాటులో ఉన్న మందులు గురించి కలెక్టర్ ఆరా తీశారు. సరిపడినన్ని ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

# ఘనంగా కాలంరాజుపేట ఎల్లమ్మ జాతర

## - భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి ఎల్లమ్మ తల్లి - వైభవంగా సిరిమానోత్సవం





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో ఎల్లమ్మ జాతర ఘనంగా జరిగింది. బుధవారం తోలేలు ఉత్సవంతో ప్రారంభమైన జాతర గురువారం ప్రధాన ఘట్టమైన సిరీమాను సంబరంతో ముగిసింది. సిరీమాను దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో మూడు పర్యాయాలు సిరీమాను తిరగగా భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. నిర్వాహకులు గ్రామ సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, ఎంపీటీసీ గేదెల జగదీష్, మాజీ ఎంపీటీసీ గేదెల ఈశ్వరరావు ఆధ్వర్యంలో జాతర వైభవంగా జరిగింది.

గురువారం ఉదయం నుంచే ఎల్లమ్మ గుడి వద్ద అమ్మ వారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ప్రధానంగా మండలం లోని సీతారాంపురం, కాలం రాజుపేట, డోలపాలెం, పాత శ్రీరంగరాజపురం, కొత్త శ్రీ రంగరాజపురం, ఎం. వెంకటాపురం గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ జాతరకు హాజరయ్యారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికపై హైకోర్టు కీలక నిర్ణయం




**మంచిర్యాల, (రాజధాని వార్తలు):** క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మూడు వారాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు పై విధంగా ఆదేశించింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లిలో పలు రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అర్థంతరంగా నిలిచిపోయింది. ఇక బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా.. ఇటీవల బెయిల్ మంజూరు అయింది. అనంతరం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత కేతనపల్లిలోని తన నివాసంలో బాల్క సుమన్ విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎంపీ వంశీ కృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తనను జైల్లో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారంటూ పోలీసులపై ఆయన మండిపడ్డారు. ఫిబ్రవరి 11వ తేదీన తెలంగాణలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు పోలింగ్ నిర్వహించారు. ఫిబ్రవరి 14వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అనంతరం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్ పదవుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాగే క్యాతనపల్లిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వేళ.. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఆగిపోయింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ నేతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు పై విధంగా ఆదేశాలు జారీ చేసింది.

# ప్రైవేట్ బస్సు బోల్తా పడి స్పాట్‌లో ఐదుగురి దుర్మరణం

**ఇంటర్నెట్ డెస్క్:** ఛత్తీస్‌గఢ్‌లోని జాష్‌పూర్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మరికొన్ని గంటల్లో తమ గమ్య స్థానం చేరుకుంటామనే లోపు మృత్యు ఒడిలోకి చేరుకున్నారు. ఒక ప్రైవేట్ బస్సు బోల్తా పడటంతో ఐదుగురు మృతి చెందగా, 20 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను దగ్గరలోని ఆస్పత్రులకు తరలించారు. తప్కరా పోలీస్ స్టేషన్ పరిధిలోని గోడాంబ గ్రామ సమీపంలో బస్సు అదుపు తప్పి బోల్తా పడటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. జార్ఖండ్‌లోని కుర్దేగ్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని కుంకురి పట్టణం వైపు వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురి కావడంతో బస్సులో ఐదుగురు మృతి చెందారని జాష్‌పూర్ సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ లాల్ ఉమేద్ సింగ్ తెలిపారు.




ప్రమాద సమయంలో బస్సులో 24 మంది ప్రయాణికులు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# దేశవ్యాప్త కమెండో పోటీల్లో ఏపీ పోలీసుల జైత్రయాత్ర.. నాలుగు ప్రతిష్టాత్మక ట్రోఫీలు కైవసం

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగంలోని ఎలైట్ ఫోర్సెస్ అయిన గ్రేహౌండ్స్, ఆక్టోపస్ కమెండోలు జాతీయ స్థాయిలో మరోసారి తమ సత్తా చాటుకున్నారు. హర్యానా రాష్ట్రం మనేసర్‌లోని నేషనల్ సెక్యూరిటీ గార్డ్ క్యాంపస్‌లో నిర్వహించిన 16వ ఆల్ ఇండియా పోలీస్ కమెండో పోటీల్లో ఏపీ బృందం అద్భుత ప్రదర్శన కనబరిచి, నాలుగు ప్రతిష్టాత్మక ట్రోఫీలతో పాటు పతకాలను సాధించింది. పోటీలన్నింటిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ఏపీ పోలీసు కమెండో దళానికి 'ఉత్తమ రాష్ట్ర పోలీసు కమెండో' ట్రోఫీ దక్కింది. దానితో పాటు షూటింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు గాను 'బ్లాక్ హాక్ ట్రోఫీ'. దేశంలో ఉత్తమ ఆపరేషనల్ లీడర్ షిప్ కనబరిచినందుకు గాను 'రణనీతి ట్రోఫీ'. ఓవరాల్ కమెండో పోటీల్లో అద్భుత ప్రదర్శనకు గాను కాంస్య పతకం సొంతం చేసుకున్నారు.

**డీజీపీ అభినందనలు..**




జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను పెంచిన కమెండోలను రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రత్యేకంగా అభినందించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బృందాల కోర శ్రమ, క్రమశిక్షణే ఈ విజయానికి కారణం అని ఆయన కొనియాడారు. భవిష్యత్‌లో కూడా ఇదే తరహాలో నిబద్ధతతో పనిచేసి దేశ రక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

# సిరిపురం గ్రామస్తులు కాశీ వారాహి అమ్మవారికి సారె





**కరప, (రాజధాని వార్తలు):** కాశీ వారాహి అమ్మవారి ఆలయంలో గురువారం భక్తి శ్రద్ధలతో సారే కార్యక్రమం వైభవంగా జరిగింది. కాకినాడ–రామచంద్రపురం రహదారిపై మండల కేంద్రం కరప, కొరిపల్లె పరిధిలో చిక్కాల దొరబాబు నిర్మించిన ఈ ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. సిరిపురం గ్రామస్తులు అమ్మవారిని తమ ఆడపడుసుగా భావించి గ్రామం మొత్తం ఏకమై బ్యాండ్ మేళాలతో చీరలు, సారే, పసుపు, కుంకుమ, గాజులు, స్వీట్లు, పండ్లు, అరటిగెలలు సమర్పించారు. కరప గ్రామ దేవత ఉప్పాలమ్మ తల్లి ఆలయం నుండి సిరిపురం మహిళలు చీరలు, సారీలు, పసుపు, కుంకుమ, గాజులు, స్వీట్లు, పండ్లు, అరటి గెలలతో కాశీ వారాహి మాత ఆలయం వరకు సారే కార్యక్రమం నిర్వహించారు.

ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమంలో మహిళలు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీర్వాదం కోరారు. గ్రామస్తులంతా ఐకమత్యంతో పాల్గొని భక్తి పరవశంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చెక్కల రామచంద్రరావు, చిక్కాల దొరబాబు, చిక్కాల సుబ్బారావు, నక్కా బద్రం, పోలిశెట్టి తాతీలు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan